# 47

# యేసు చిన్న పిల్లలను ఆశీర్వదించుట

## (19:13-15)

ఈ సన్నివేశము యేసుతో జరుగుచుండిన వివాహము గూర్చిన చర్చకు (19:1-12). ఒక స్వాభావికమైన తదనంతర అంశమయ్యింది. ఈ అంశము ఈ సందర్భములోనే ఎందుకు ఉంచబడినట్లు?- చర్చనీయ విషయ సంబంధమైన అంశముగా ఉంచబడినదా లేక, ఒక కాలక్రమానుసారమైన విషయముగా ఉంచబడినదా మనము ఖచ్చితంగా చెప్పలేము. లూకా ఈ సన్నివేశమును ప్రార్థన చేయుటకై వెళ్లిన పరిసయ్యుడు మరియు సుంకరి గూర్చిన ఉపమానము తరువాత గ్రంథస్థంచేసాడు (లూకా 18:15-17). మత్తయి వ్రాసిన సువార్తలోని దీనికి ముందటి అధ్యాయంలో, ఒకడు తనను తాను తగ్గించుకొనుట గూర్చిన పాఠమును ఆయన ఉపదేశించుచుండిన సందర్భములో యేసు ఒక చిన్న బిడ్డను వారి ముందర నిలువబెట్టి ఆ పాఠమును నేర్పించాడు (18:1-6, 10); కానీ ఈ సందర్భములో పిల్లల నిమిత్తమే యేసు పిల్లలతో వ్యవహరించాడు.

### పిల్లలు తేబడిరి (19:13)

**13అప్పుడు ఆయన వారిమీద చేతులుంచి ప్రార్థన చేయవలెనని కొందరు చిన్న పిల్లలను ఆయన యొద్దకు తీసికొనివచ్చిరి.**

**వచనము 13. చిన్నపిల్లలు** అని అర్థమిచ్చు గ్రీకుపదము (*paidion* నుండి) తరుచుగా శిశువులను మరియు తప్పటడుగులు వేస్తూ నడిచే చంటిబిడ్డలను సూచించును. ఏది ఏమైనా, కొన్ని సందర్భములలో, చంటి బిడ్డల వయస్సును మించిన పిల్లలను, కనీసము పన్నెండేళ్ల వయస్సు వచ్చిన పిల్లలను (మార్కు 5:39, 42) కూడ సూచించుటకు ఈ పదము ఉపయోగింపబడుచున్నది. "తమ శిశువులను ముట్టవలెనని" కొందరు ఆయన యొద్దకు తీసికొని వచ్చుచుండిరని లూకా సువార్తికుడు చెప్పుచున్నాడు (లూకా 18:15). బహుశా ఆ యా వయస్సులకు చెందిన చిన్న పిల్లలను వారి తలిదండ్రులు యేసు యొద్దకు **తీసికొనివచ్చి యుందురు.** మార్కు మరియు లూకా సువార్తల రచయితలు "తీసికొని వచ్చిరి"/"తీసికొని రాగా" అను అసంపూర్ణ భూతకాల క్రియా పదమును రచించారు, అనగా కొంత సేపటి వరకు కూడ యేసు యొద్దకు చిన్నపిల్లలు వచ్చుచునే యుండిరని లేదా తేబడుచుండిరని ఇది అర్థమిచ్చుచున్నది (మార్కు 10:13; లూకా 18:15).

చిన్నపిల్లలను పెద్దలైన తలిదండ్రులు యేసు యొద్దకు తీసికొనివచ్చుటకు గల హేతువు సూచింపబడినది: **ఆయన వారి మీద చేతులుంచి ప్రార్థన చేయవలెను**. చిన్న పిల్లల మీద చేతులుంచబడుచుండిన అభ్యాసము పితురుడైన యాకోబు కాలము నాటికి, తన మనుమలు మనుమరాండ్రపై చేతులుంచి వారి యెడల దీవెన వచనములు పలికిన సందర్భమునకు

మన తలంపులను తీసికొని వెళ్లును (ఆదికాండము 48:14-16). కాబట్టి ఇలా చిన్న పిల్లల మీద చేతులుంచుట యేసు కాలములో సహితము ఒక వాడుకయై యుండును. పిల్లల మీద చేతులుంచుట ద్వారా వారి చేత దీవింపబడునట్లు చిన్నపిల్లలు యూదా మత బోధకుల యొద్దకును, సమాజములో పేరుగాంచిన ఇతర అధ్యాపకుల యొద్దకును తేబడుచుండిరి.[1] టాల్ముడ్‌లో ప్రచురితమైన ఒక చిన్న వ్యాసము ద్వారా తెలియుచున్న ఇటీవలి సాంప్రదాయము ఈ దృక్పథమును బలపర్చుచున్నది:

> ఇదే విధముగా వారు ఉపవాసముండిన రోజున వారి యౌవన కుమారులు మరియు యౌవన కుమార్తెలు తమ్మునుతాము శారీరకంగాను మానసికంగాను నలుగగొట్టుకొనునట్లు శిక్షణ ఇవ్వబడుచుండిన ఒక చక్కని వాడుక యెరుషలేములో ఉండినది: ఎలాగంటే పదకొండు సంవత్సరముల వయస్కులైతే సగము దినము వరకు, పన్నెండు సంవత్సరముల వయస్కులైతే దినమంతా, పదమూడు సంవత్సరముల వయస్కులైతే (మగపిల్లలు) వారు యూదుల ధర్మశాస్త్రమైన తోరాను అధ్యయనము చేసి ఆ తరువాత సత్క్రియలు చేయుట యందు నిమగ్నులగుటకు యోగ్యులగునట్లు పెద్దలు వారిని ఆశీర్వదించి వారి కొరకు ప్రార్థించునట్లు వారు ప్రతి పెద్ద యొద్దకు తేబడిరి.[2]

తమ పిల్లలను యేసు యొద్దకు తీసికొని వచ్చిన తల్లిదండ్రులు ఆయన వారికి అత్యుత్తమమైన ఆశీర్వాదమును అనుగ్రహించవలెనని ఆశించారు. యేసు, మహా ఉపదేశకుడు, వారి కుమారులకు మరియు కుమార్తెలకు తన దయగల ఆమోదమును మరియు ప్రోత్సాహమును వారికి దయచేయవలెనని కోరుచుండిరి.

### శిష్యుల ప్రతిస్పందన (19:13)

**13ఆయన శిష్యులు, తీసికొని వచ్చిన వారిని గద్దించిరి.**

**వచనము 13**. యేసు యొద్దకు అనేక మంది పిల్లలను తీసుకొని వచ్చుచుండిరి గనుక **శిష్యులు** ఎందుకంత ఆందోళన చెందారో తమ పిల్లలను తీసికొని వచ్చుచుండిన వారిని నిరోధింపవలెనని ఎందుకంత ఆతురపడిరో అర్థమగుచున్నది. శిష్యులు తీవ్రంగానే స్పందించినట్లు ఈ వచనములోని మాటలు సూచించుచున్నవి. **గద్దించిరి** (*epitimaō* నుండి) అను పదము బెదిరించిరి అను అభిప్రాయమును కలుగజేయగలదు. అంతకు ముందు యేసు, ఒకడు తనను తాను తగ్గించుకొనుట యుక్తమని వారికి బోధించుటకు శిష్యుల ముందర ఒక చిన్న బిడ్డను నిలువబెట్టి యుండెను గనుక ఇప్పుడు ఈ సందర్భములో శిష్యులు ఎందుకిలా ప్రవర్తించారో, కొంత ఆశ్చర్యమును కలుగజేస్తుంది (18:1-4). యేసు ఈ చిన్న పిల్లలను స్వీకరించుట కంటే ఆయన ఉపదేశించుట మరియు స్వస్థపరచుట ఎక్కువ ముఖ్యమైన పనులై యున్నవని లేక ప్రజలు ఈ విధంగా యేసును చుట్టుముట్టివేయుట వలన ఆయన యెరూషలేమునకు వెళ్లవలసిన ప్రయాణం ఆలస్యమగుచుండినదని శిష్యులు అనుకొని యుండవచ్చును.

## యేసు చిన్నపిల్లలను ఆశీర్వదించుట
## (19:14, 15)

**[14]యేసు–చిన్న పిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడి; పరలోక రాజ్యము ఈలాటివారిదని వారితో చెప్పి [15]వారి మీద చేతులుంచి, అక్కడ నుంచి లేచిపోయెను.**

**వచనము 14**. తలిదండ్రులు తమ పిల్లలను **యేసు** యొద్దకు తీసికొని వచ్చినప్పుడు, ఆయన వారిని ఎల్లప్పుడు ఎంతో కృపాసహితముగా స్వీకరించాడు. **చిన్న పిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడని** ఆయన చెప్పాడు. ఇప్పుడు, గద్దించుచుండినవారు గద్దింపబడిరి. యేసు శిష్యుల మీద "కోపపడెను" (మార్కు 10:14). పరలోక రాజ్యములో ప్రవేశింపగోరువాడు "మార్పునొంది బిడ్డలవంటివాడు కావలసి యున్నదని" ఆయన అదివరకే వారికి బోధించి యుండెను (18:3). **పరలోక రాజ్యము ఈలాటివారిదని** కూడ యేసు చెప్పాడు. అనగా, పరలోకము చిన్న పిల్లలు ప్రదర్శించు నమ్మకముంచుట, మరియు వినయము కనుపర్చుట యను పిల్లల వైఖరి గలవారితో నిండియుండునని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

ఈ వచనము శిశు బాప్తిస్మమును ప్రామాణికము చేయుటలేదు; వాస్తవమునకు, అది దానిని త్రోసిపుచ్చుచున్నది. యేసు ఈ చిన్న పిల్లలకు బాప్తిస్మమియ్యలేదు; ఆయన ఎప్పటివలెనే వారి మీద చేతులుంచి వారిని ఆశీర్వదించాడు. శిశు బాప్తిస్మము గూర్చిన సిద్ధాంతము ఇచ్చట లేదా క్రొత్త నిబంధనలో మరెచ్చటనైనను పేర్కొనబడలేదు. ఈ అభ్యాసము వాడుకలో ఉండినట్లు లేఖనానుసారమైన ఆధారాలేవియును లేవు. ఇందుకు గల హేతువులు విదితమై యున్నవి: శిశువులపై అపరాధ దోషము లేదు, మరియు బాప్తిస్మము "పాపక్షమాపణ నిమిత్తమై" ఉద్దేశింపబడినది (అపొస్తలుల కార్యములు 2:38). శిశువులు విశ్వాసముంచి, మారుమనస్సునొంది, పాపములను ఒప్పుకొనగల–బాప్తిస్మము పొందుటకు ఇవి అవసరమైయున్నవి–మానసిక సామర్థ్యముగలవారు కాదు (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38; 8:36–38; రోమీయులకు 10:9, 10).

శిశువులకు బాప్తిస్మమిచ్చు వాడుక క్రీ.శ. మూడవ శతాబ్దము నాటిదై యున్నది. అసంఖ్యాకమైన అంత్యక్రియోచితమైన స్మారక చిహ్నముల నిదర్శనములను పరిశీలనగా పరీక్షించిన తరువాత, శిశు మరణాల సగటు సంఖ్య మరీ విపరీతంగా పెరిగిపోయి యుండిన రోజుల్లో తలిదండ్రులకు అభయము నిచ్చుటకు శిశు బాప్తిస్మ వాడుక ప్రవేశపెట్టబడినదని ఎవరెట్ ఫెర్గూసన్ తన అభిప్రాయమును వెల్లడించాడు. కాబట్టి ఇట్టి పరిస్థితులలో వారి చిన్న బిడ్డలు ఎక్కువ కాలము బ్రతికి యుండరేమోనన్న భయమునుబట్టి, వారి పిల్లలు దేవుని రాజ్యములో భాగమై యున్నారను వాస్తవమును తెలిసికొనవలెనని తలిదండ్రులు ఎంతో ఆశించారు, గనుక చిన్న పిల్లలకు బాప్తిస్మమియ్యబడినది.[3] ఏది ఏమైనా, ఇవ్విధమైన అధికారపూర్వక అభయమును దేవుడు తన వాక్యములో మనకియ్యలేదు. చిన్న పిల్లల గూర్చిన చింతను మనము దేవుని ప్రేమపూర్వకమైన శ్రద్ధకు విడచిపెట్టవలెను.

**వచనము 15**. యేసు శిష్యులను గద్దించిన తరువాత, ఆయన **వారి మీద చేతులుంచి** చిన్న పిల్లలను ఆశీర్వదించాడు. యేసు చిన్న పిల్లలను ఎత్తి కౌగలించుకొన్నాడను ఆకర్షణీయమైన వర్ణనను మార్కు ఇచ్చుచున్నాడు (మార్కు 10:16). తలిదండ్రుల కోరిక

మేరకు, యేసు ఆ చిన్న పిల్లల కొరకు ప్రార్థించి యుంటాడు (19:13). ఆయన చిన్న పిల్లలను ఆశీర్వదించిన తరువాత, **అక్కడ నుంచి లేచిపోయెను.**

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### చిన్న పిల్లలను ఆశీర్వదించుట (19:13–15)

ఆయన తమ పిల్లలకు అత్యుత్తమమైన ఆశీర్వాదములను అనుగ్రహించవలెనని ఆశించిన తలిదండ్రులు తమ పిల్లలను ఆయన యొద్దకు తీసికొని వచ్చారు. అపొస్తలుల గద్దింపు చేత నిరుత్సాహపడినప్పటికిని, వారు యేసు యొద్దకు చేరకుండునట్లు నివారింపబడలేదు. చివరకు, యేసు తమ పిల్లలను ఆశీర్వదించి వారి కొరకు ప్రార్థించాడు. ఈ నాడు, క్రైస్తవ తలిదండ్రులు తమ పిల్లలకు అత్యుత్తమమైనదే అనుగ్రహింపబడాలని ఆశిస్తున్నారంటే ఆశ్చర్యము లేదు. మన పిల్లలు యేసు దయచేయు దీవెనలు పొందునట్లు మనము వారిని అనేక విధాలుగా ఆయన యొద్దకు తీసికొని రావచ్చును: (1) వారితో శ్రేష్ఠమైన సమయము గడుపుము, (2) వారనుకరింపదగు మాదిరిని ప్రదర్శించుము, (3) వారికి దేవుని వాక్యము బోధించుము, (4) బైబిల్ అధ్యయన తరగతులకు, సబ్బాతు బదులకు, ఆదివారం నాటి సంఘారాధనలకు వారిని క్రమముగా తీసికొని వెళ్లుము, (5) వారి కొరకు నీ వ్యక్తిగతముగాను, వారితో కూడను ప్రార్థించుము, మరియు (6) క్రీస్తు రాజ్యములో పరిచారకులగునట్లు వారిని ప్రోత్సాహించుము.

డేవిడ్ స్టూవర్ట్

---

సూచికలు:

[1]David Hill, *The Gospel of Matthew*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 282. [2]Talmud *Soferim* 18.5. [3]Everett Ferguson, "Inscriptions and the Origin of Infant Baptism," *Journal of Theological Studies* n.s. 30 (April 1979): 46.